## అక్షర ఆంధ్రా ఉల్లాస్ ఎఫ్ ఎల్ ఎన్ ఏ టి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 11:**అక్షర ఆంధ్రా ఉల్లాస్ 2025--26 పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశం డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అడపా వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వయోజన విద్యా శాఖ ఉపసంచాలకులు పసుపులేటి పోశయ్య మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో పాటించవలసిన నిబంధనలపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎఫ్ .ఏ ,యాప్‌లో హాజరు నమోదు విధానం, పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గణాంక సహాయకులు సునీల్, ఆనందబాబు, పోలిశెట్టి రాజేష్ అలాగే డ్వామా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఏపీవోలు పరీక్షల నిర్వహణను పారదర్శకంగా నిర్వహించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు సూచించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఎయిర్ ఫోర్స్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి భారీ స్పందన






**గుంటూరు, కాకినాడ, పెన్ పవర్,మార్చి 11:**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి భారీ స్పందన లభిస్తోందని హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ తెలిపారు. బుధవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళా మరియు పురుష అభ్యర్థులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీలో భాగంగా మార్చి 9 నుండి మహిళా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రెండు సార్లు నోటిఫికేషన్ విడుదల చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఎంపికలు చేపడతామని, అదనంగా తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అర్హత గల అభ్యర్థులు నేరుగా ర్యాలీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

12న ఆంధ్రప్రదేశ్ పురుష అభ్యర్థులు -- 15న తెలంగాణ పురుష అభ్యర్థులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పురుష అభ్యర్థులకు మార్చి 12న, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పురుష అభ్యర్థులకు మార్చి 15న ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరుగుతుందని చెప్పారు. 2005 జూలై 2 నుండి 2009 జనవరి 2 మధ్య జన్మించిన అవివాహిత పురుష అభ్యర్థులు ఈ ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. అర్హతలు

కనీస ఎత్తు: 152 సెం.మీ. (స్త్రీలు, పురుషులు)విద్యార్హత:

ఇంటర్మీడియట్ (10o2) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత

లేదా 3 సంవత్సరాల డిప్లొమా ఇంజనీరింగ్లేదా 2 సంవత్సరాల వొకేషనల్ కోర్సు ఉత్తీర్ణత

మొత్తం మార్కుల్లో 50%, ఇంగ్లీష్‌లో 50% మార్కులు తప్పనిసరి

ఎంపిక విధానం. అభ్యర్థులకు ముందుగా 1.6 కిలోమీటర్ల పరుగు పోటీ, తదుపరి భౌతిక మరియు శారీరక పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణులైన వారికి రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్ష ప్రశ్నాపత్రం ఇంగ్లీష్ మరియు హిందీ భాషల్లో ఉంటుంది. తప్పు సమాధానానికి పావు మార్కు నెగెటివ్ మార్కింగ్ ఉంటుందని తెలిపారు. తీసుకు రావాల్సిన పత్రాలు అభ్యర్థులు క్రింది పత్రాలు తీసుకురావాలని సూచించారు:

ళ మరియు ళ×× తరగతి పాసైన సర్టిఫికేట్లు (ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధృవీకరించినవి)

డొమిసైల్ సర్టిఫికేట్ఎస్‌సీ సర్టిఫికేట్ (ఉంటే)ఆధార్ కార్డుఈమెయిల్ ఐడి, మొబైల్ నంబర్ఇటీవలి 10 పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలుప్రతి సర్టిఫికెట్‌కు 6 జిరాక్స్ కాపీలుఉదయం 4 గంటల నుంచే అనుమతిఆంధ్రప్రదేశ్ పురుష అభ్యర్థులు మార్చి 12, తెలంగాణ పురుష అభ్యర్థులు మార్చి 15 తేదీలలో ఉదయం 6 నుండి 10 గంటల మధ్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో హాజరు కావాలని తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే ప్రవేశం ఉంటుంది, అయితే ఉదయం 10 గంటల తర్వాత ప్రవేశం ఉండదు అని స్పష్టం చేశారు. విజయవాడ మరియు గుంటూరు నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోరాదని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్. గుణశీల పాల్గొన్నారు.

## బాలమందిరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉగాది కథల పోటీ కరపత్రాల ఆవిష్కరణ

గడువు తేదీ మార్చి 12 నుంచి 16 వరకూ పెంచినట్లు వెల్లడి



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 11;**బాలమందిరం ఆధ్వర్యంలో డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి ఉగాది కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు బాలమందిరం అధ్యక్షులు, ప్రముఖ రచయిత కృష్ణశ్రీ తెలిపారు. బుధవారం ఆలమూరు శాఖా గ్రంథాలయంలో ఆలమూరు వెటర్నరీ ఏడీఏ డా.ఎల్.అనిత, గ్రంథాలయాధికారి టి.నమశ్శివాయ,పాఠకుల చేతుల మీదుగా కథల పోటీలకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పోటీలకు కథలను పంపే గడువును మార్చి 12 నుంచి 16 వ తేదీ వరకూ పెంచినట్లు కృష్ణశ్రీ తెలిపారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు, విలువలకు అద్దం పట్టే విధంగా, కుటుంబ వ్యవస్థను బలపరిచే విధంగా, గతంలో ఎక్కడా ప్రచురితం కాని, హామీ పత్రంతో కూడిన కథలను పోస్టు ద్వారా కృష్ణశ్రీ, డోర్ నెం. 2-165/1, సంధిపూడి,ఆలమూరు మండలం, డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పిన్ 533232 కు, వాట్సాప్ లో 9963163136 ద్వారా పంపాలని కోరారు. కార్యక్రమంలో పాఠకులు గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అసత్యాల విషజీవి జగన్: మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం/అమరావతి, పెన్ పవర్,మార్చి 11:**వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అబద్దాలు, అసత్యాలతో కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిచిన జగన్, ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకునే అప్పులు అభివృద్ధి ప్రాజెక్టులు, మౌలిక వసతులు, పరిశ్రమలు మరియు ఉద్యోగాల కల్పన కోసం వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ఎన్ చంద్రబాబు నాయుడు పై జగన్ చేసిన వ్యాఖ్యలను కూడా సుభాష్ ఖండించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితేనే ప్రజలు నమ్ముతారని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కదని జగన్‌కు మంత్రి సుభాష్ హితవు పలికారు.

# మంచి ఉత్తీర్ణత తీసుకురావాలి




**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 11:**త్వరలో జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా బాగా రాసి మంచి ఉత్తీర్ణత తీసుకువచ్చి పాఠశాలకు గ్రామానికి పేరు తీసుకురావాలని బలుసుతిప్ప, కందికుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పి.వి సత్యనారాయణ, జేబివి రమణ పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ఆవరణలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు .ఈ సందర్భంగా పాల్గొన్న గ్రామ పెద్దలు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణతను సాధించాలన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు పదో తరగతి ఉత్తీర్ణత ఎంతో కీలకమైనదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు .వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు .విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. చూపారులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘాని వెంకటేశ్వర్లు బలుసితిప్ప, కందికుప్ప గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇంటి నిర్మాణాల అనుమతులతో నిర్మిస్తున్న షాపులను వెంటనే నిలిపివేయాలి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 11**: జగ్గంపేటలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణ అనుమతులతో నిర్మిస్తున్న షాపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎండిఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, పంచాయతీ సెక్రెటరీ అండదండలతో కేవలం పంచాయతీకి చెందవలసిన పన్నులను ఎగొట్టడానికి ఇంటి నిర్మాణం కొరకు తీసుకున్న అనుమతులతో షాపులు నిర్మిస్తున్నారని ఆ షాపులను తక్షణమే నిలిపేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగా పంచాయితీలను అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇలాంటి విషయంలో నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. 70 శాతం పూర్తయిపోయిన షాపులకు ఇప్పటివరకు స్పందించలేదంటే ఎంతవరకు పర్యవేక్షణ ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందని ఆయన తెలిపారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే పన్నులు ఎగ్గొట్టకూడదని పన్నులు కడితే అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కానీ ఇక్కడ లంచాలకు అలవాటుపడి అభివృద్ధిని, బాధ్యతలను గాలికి వదిలేస్తున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే ఈ షాపులపై విచారణ చేపట్టి నిలిపేయాలని, అలాగే పంచాయతీ కార్యదర్శి పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు డాన్ శ్రీను, రవణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పీఎంపీల ఆధ్వర్యంలో నూతన ఔషధాలపై అవగాహన సదస్సు

**మండపేట. పెన్ పవర్. మార్చి 11:** కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాయవరం, ఆలమూరు మండలాల ఆధ్వర్యంలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ సహకారంతో నూతన ఔషధాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం మండపేటలోని సహస్ర రెస్టారెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పీఎంపీ అసోసియేషన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీఎంపీ సభ్యుడు ఔషధాల వినియోగంపై సరైన అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని తెలిపారు. నేషనల్ నో స్మోకింగ్ డే సందర్భంగా ధూమపానం వల్ల కలిగే ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నౌడు వెంకటరమణ, పీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ లు పంపిణీ




**మండపేట: పెన్ పవర్. మార్చ్ 11 :**28వ వార్డులో ఉన్న సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆ వార్డు కౌన్సిలర్ మొండి భవాని తన సొంత ఖర్చులతో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉన్నత విద్యకు వెళ్లేందుకు పదవ తరగతి కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పిన విధంగా చదివి పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. మొబైల్ ఫోన్లు, టీవీలు, సోషల్ మీడియా వంటి వాటికి దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కౌన్సిలర్ మొండి భవాని మాట్లాడుతూ తన వార్డులో సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు హైస్కూల్ ఉండటం ఆనందకరమన్నారు. తమ పదవీకాలం ముగిసే దశలో ఉన్నప్పటికీ స్కూల్ అభివృద్ధికి చేసిన కృషి సంతృప్తినిచ్చిందని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థులు బాధ్యతగా చదివి పదవ తరగతి పరీక్షల్లో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి. రామచంద్రారెడ్డి, జి.వి.వి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ అమోఘం




**కాజులూరు, పెన్ పవర్, మార్చి 11:**జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విజ్ఞాన వారోత్సవాల్లో భాగంగా కాకినాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఏపీఎస్పీ క్వార్టర్స్)లో నిర్వహించిన పోటీలలో పి.ఎం.శ్రీ జిల్లా ఉన్నత పాఠశాల, కాజులూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సైంటిస్ట్ మోనో యాక్షన్ విభాగంలో బేబీ శ్రీ జాహ్నవి ప్రథమ స్థానాన్ని సాధించగా, పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగంలో జెస్సీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవడంతో పాటు శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్ చింతా నారాయణమూర్తిను, విజేతలను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, కమిటీ సభ్యులు, మండల విద్యాశాఖాధికారులు డేవిడ్, జాన్, పాఠశాల విద్యాదాత అన్యం శ్రీరామచంద్రమూర్తి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, సైన్స్ ఉపాధ్యాయులు సత్యప్రసాద్, సుజాత, రాజరాజేశ్వరి, గీతా కృష్ణవేణి, సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మీకామేశ్వరి, శ్రీనివాసరావు, బాషా తదితరులు అభినందించారు.

# ప్రత్తిపాడు మండలంలో పులి జాడ కోసం ముమ్మర గాలింపు చర్యలు

-మండలంలోని దారపల్లి పరిసరాలలో పులి ఉందని నిర్ధారణ అయినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ మార్చి 11:**గత పది రోజులుగా పోలవరం, కాకినాడ జిల్లాల మధ్య ఏలేరు నదీ పరివాహక ప్రాంతం, వెనుక జలాలు మరియు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పెద్ద పులి నేడు ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని ఖర్జూరపాలెం వేపకొండ వద్ద సంచరించినట్లు అధికారులు ధృవీకరించారు.

పులి సంచారాన్ని గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు డ్రోన్ కెమెరాలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిఘా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పులి అటవీ ప్రాంతంలోనే సురక్షితంగా ఉందని అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల్లో పశువులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

రెవెన్యూ, పోలీస్ మరియు అటవీ శాఖలు సమన్వయంతో చర్యలు చేపడుతున్నాయి. స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీస్ మరియు అటవీ అధికారులు కలిసి పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ఎస్ అప్పారావు, ఎస్ఐ,ఎస్ లక్ష్మీకాంతం,తహసీల్దార్ ఎం సూర్యప్రభ, అటవీ శాఖ అధికారులు

ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం, కిత్తమూరిపేట, కె.మిర్తివాడ, ఈ.గోకవరం, కొండపల్లి, బురదకోట, బాపన్నదొర, ఉలిగోగుల, మెట్టుచింత, ధారపల్లి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ " డా. కె హెచ్ కె ప్రసాద్ "కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 11** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఈ.సి.ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న" హనుమంత్ కృష్ణ ప్రసాద్.కె " జె.ఎన్.టి.యు.కె కాకినాడ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె.ఎన్.టి.యు.కె కాకినాడ కి చెందిన ఈ.సి.ఇ విభాగం ప్రొఫెసర్ డా.బి.టి.కృష్ణ నేతృత్వంలో "డా. కె హెచ్ కె ప్రసాద్ " సమర్పించిన "థీసిస్ శీర్షిక:"బయో మెడికల్ సిగ్నల్ క్లాసిఫికేషన్ యూజింగ్ మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా. కె హెచ్ కె ప్రసాద్ " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి. డా. గమిని శ్రీదేవి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది "డా. కె హెచ్ కె ప్రసాద్ "కి అభినందనలు తెలిపారు

## ఆదిత్య యూనివర్సిటీలో విజయవంతంగా ముగిసిన 'బయోఏఐ' ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కార్యక్రమం




**గండేపల్లి, పెన్ పవర్,మార్చి,11** గండేపల్లి మండలం, సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ ఆదిత్య లెర్నింగ్ అకాడమీ మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "బయోఏఐ: డీప్ లెర్నింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ ట్రాన్స్‌లేషనల్ బయోఇన్ఫర్మాటిక్స్" అనే ఆధునిక అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్స్‌లర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి 7:30 గంటల వరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌లేషనల్ బయోఇన్ఫర్మాటిక్స్‌కు సమగ్ర పరిచయం కల్పించడంతో పాటు బయాలజీ మరియు మెడిసిన్ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు డీప్ లెర్నింగ్ వినియోగంపై విపులమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు మరియు పరిశ్రమ నిపుణులు బయో-ఏఐ రంగంలో జరుగుతున్న తాజా పరిణామాలు తెలుసుకొని తమ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని పొందారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆన్‌లైన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా డా. టి. సుధారాణి వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డా.ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్ చాన్స్‌లర్ (అకాడెమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ చాన్స్‌లర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్) డా. ఏ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కోఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ డా. సైకం జాలయ్య తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా జనసేన సభ్యత్వాలు



**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 11:** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సత్తి సోమరాజు 500 జనసేన సభ్యత్వాలు పూర్తి చేశారు. జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 24 గంటల్లోనే( మొదటి రోజే) అత్యధిక సభ్యత్వాలు చేయించినందుకు మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుండి సోమరాజు ను అభినందిస్తూ ఫోన్ కాల్ వచ్చింది. జగ్గంపేట నియోజకవర్గం లో 500 సభ్యత్వాల మార్క్ అందరికంటే ముందుగా చేరుకున్నందుకు జనసేన పార్టీ అఫీషియల్ ఫేస్బుక్ పేజ్ లో సోమరాజు పేరు, అతని ఫోటో,గ్రామం,నియోజకవర్గము, తదితర వివరాలతో అభినందనలు తెలియజేసారు. సోషల్ మీడియా ఫోన్ల ద్వారా పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ గతంలో రైల్వేలో చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగమునకు రాజీనామా చేసి, ఉప్పలపాడు గ్రామ ప్రజలకు సేవ చేయడానికి నిర్ణయించుకుని,నిజాయితీ సేవాభావంగల పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో జాయిన్ అయ్యి, బాధ్యతతో కృషి చేస్తున్నానని తెలియజేశారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



**మండపేట.పెన్ పవర్. మార్చ్ 11 :**మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగంగా నిర్వహించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. మండపేట నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి శ్రీనివాసరావు, ఉండమట్ల సురేష్, ఎంపీపీ ఉండమట్ల వాసు, కర్రి సుభాష్, ఉండమట్ల శ్రీనివాస్, పినిపే రాజు, తొర్లపాటి ప్రసాద్, గారపాటి శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, కంటిపూడి సుభాష్, లంక సూరిబాబు, గనిశెట్టి సత్తిబాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇర్రిపాక లో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 11:** జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సున్నితంగా హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులను ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునే విధంగా ర్యాలీలు చేపట్టి తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అవసరమైతే నేను కూడా ఇంటింటికి తిరుగుతానని ఆయన ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ఫ్యాన్లు, పాఠశాలలకు రంగులు, మైనర్ రిపేర్లు చేయించడం జరుగుతుందని, విద్యార్థిని విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధిచేసిన మంచినీళ్లు కూడా అందిస్తామని ఆయన తెలియజేశారు.

